-నేదునూరి శ్రీనివాసరావు, సన్నాఫ్
రామారావు, ఉత్తరావల్లి పోస్ట్
మెరకముడిదాం మండలం,
విజయనగరంజిల్లా-535124

## చుక్కల చీర

"ఫీ డర్టీ సిటీలావుంది." శిల్ప కారులో వెళ్తూ చిరాగ్గా. ఆమె అలా తిట్టుకోవటానికి పాపం కారణం లేక పోలేదు. ప్రొద్దుటి నుంచి తిరుగుతున్నా ఆమెకి, ఫ్రెండ్స్‌కి నచ్చిన చీరే దొరకలేదు.

సడన్‌బ్రేక్‌తో కారాగింది.

"ఏమైంది డ్రైవర్" అంది చిరాగ్గా.

"గేటు వేశారమ్మా" అన్నాడు వినయంగా.



"ఫీ డర్టీ. గంట ముందర వేస్తారు గేటు." మళ్లీ చిరాకు పడింది. డబ్బు చాలా ఉండి, ఫారిన్‌లో చదువుకుని ఇండియా కొచ్చిన శిల్పకి ఫారిన్ రిటర్న్ వాళ్లకుండే గర్వమే ఉంది. ఈ దేశం తనకి తగదని ఆమె భావం.

చిరాగ్గా తలతిప్పిన శిల్ప కళ్లు మెరిసాయి. కారణం ఒక చుక్కల చీర. రోడ్డు పక్కన ఒక చిన్న దుకాణంలో వ్రేలాడగట్టి ఉంది. కోరాకలరుకి ఆరెంజ్ బోర్డు. చిన్న, చిన్న చుక్కలు, అలాంటిదే బ్లౌజు అందంగా అమర్చాడు వెంకటగిరి జరీచీర. ఇన్ని గంటలు తిరిగినా నచ్చనిది వెంటనే నచ్చింది శిల్పకి. కానీ రోడ్డుప్రక్కన కట్టాడే చీర ఎలాగ. అవి కొంటే తన స్నేహితులకి చులకనైపోదూ. తల తిప్పుకుంది.

కానీ రెండు నిముషాలకే మళ్లీ అటు చూసింది. షాపు యజమాని కూడా కారువంకే చూస్తున్నాడు ఆశగా.

స్నేహితులు నవ్వుకుంటారనే అనుమానం ఉన్నా కోరిక చంపుకోలేక చీర ధర అడిగిరమ్మంది డ్రైవర్‌ని.

"రెండువందలే" అన్నాడు షాపువాడు ఆశగా. "కొంచెం తగ్గిస్తాను కూడా" అన్నాడు. "రిబేటు ఉంది.".

"ఏంటీ ఆ చీర నీకు నచ్చిందా?" అంది దీప ఆశ్చర్యంగా.

"వెరీ చీప్ శారీ" అంది రాణి.

"నోనో జస్ట్‌ఫర్ టైంపాస్" అంది శిల్ప.

ఆ చీరని తన తీరని కోరికల్లో జమ చేస్తూ. ఆమెకి తీరని కోరికలా అనిపించ వచ్చు, కానీ ఉన్నాయి. బస్సులో వెళ్లటం, రోడ్డు ప్రక్క మిర్చి బజ్జీలు తినటం వగైరాలు. ఇవన్నీ తీరని కోరికలే. ఆ రాత్రి ఆ చీర కొని కట్టుకున్నట్లు కలగని తృప్తి పడింది.

సత్తుకారియర్ పట్టుకొని నడుస్తున్న రత్తిఆగిపోయింది. అందుకు కారణం ఆ చుక్కల చీరే. ఎంత బాగుండది. "ఈ కోకెంతబాబూ" అంది భయపడుతూ. "రెండొందలు" అన్నాడు నొక్కి చెబుతూ. "ఓ అమ్మో రెండొందలే" అనుకుంటూ కదిలిపోయింది సత్తికూడా. ఆ చీర తన తీరని కోరికల్లో జమ వేస్తూ. అయితే ఈసారి ఎవరికీ సందేహం రాదు.

అయితే విశేషం ఏమిటంటే రత్తి యజమానురాలు శిల్ప ఏడాదికోసారి పెట్టే చీర బదులు డబ్బులు అడిగి తీసుకుని ఆ చీర కొనుక్కుంది రత్తి. అయితే ఆ చీర చూసినప్పుడల్లా అందులో ఇనుమడించిన రత్తి అందాన్ని చూస్తూ, మనస్సులో ఏదో అసంతృప్తి రెపరెపలాడి ఏదో ఒంకపెట్టి తిట్టేది శిల్ప. ఎందుకో అర్థంకాక సతమతమయ్యేది రత్తి.

"ఈ కోకచ్చిరాలేదు" అనుకుంది.

-ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి,
24-4-30/1, విష్ణుపురి, సఫిల్‌గూడ,
హైదరాబాద్-4

## దేముణ్ణడగాలి

నగరానికి దూరంగా...నరసంచారం పగలు కూడా నామమాత్రంగానే ఉండే ప్రాంతం. అడివిలాటి చోటు. అక్కడ-- చీకటి గుయ్యారం లో... పాడుపడిన గుడి. ఆ గుడి లో-పూజాపునస్కారాలకి నోచుకోని పేద దేముడు. ఆ దేముడి ముందొక దొంగ.

దేముడి ముందు దీపం వెలిగించాడు-ప్రమిదలో నూనె, వత్తీ వేసి, భుజాన ఉన్న మూటను విప్పి-నైవేద్యం పెడు తున్నట్లు దేముడి ముందుంచాడు. భక్తిగా రెండుచేతులూ జోడించి నమస్కారం పెడుతూ కళ్లుమూసు కున్నాడు.

దేముడిముందు-దీపకాంతిలో..డబ్బుకట్టలూ, బంగారు నగలూ జిగేల్మంటూ మెరుస్తున్నాయి. "దేముడా! నీకు తెలియని దేమీ లేదు. మామూలుగా బతకలేక దొంగతనాలకి దిగాను. తొలిసారి దొంగతనానికి వెళ్తూ నీ ఆశీస్సులు పొందాను. దొంగతనం పారింది. ఇది నా పదో దొంగతనం..చివరిది కూడా. ఇంతవరకూ సంపాదించిన దానితో నా శేష జీవితం సుఖంగానూ, మంచిగానూ, గౌరవంగానూ, వెళ్లిపో తుంది. ఇకపై ఏ చెడ్డపనీ చెయ్యను. మంచిగా బతికేందుకు నాకు శక్తినివ్వు. పదిసార్లు నేను పట్టుబడకుండా... దొంగ తనం పారేలా చల్లగా దయగా చూశావు. మళ్లీ నన్నాశీర్వదించు." అని నివేదించుకుంటూ దేముడి పాదాలను కళ్లకద్దుకుంటూంటే....

ఒక్కసారి గుహలాటి గుడినిండా వెలుగు. బూట్ల శబ్దాలు.

"హాండ్సప్-" అరుపులు.

త్రుళ్లిపడి చూశాడు దొంగ. తన చుట్టూ నలుగురు పోలీసులు. తుపాకీలు గురిపెట్టి. పరిస్థితినీ నిస్సహాయతనీ గ్రహించుకుని అతను చేతులెత్తేశాడు. తక్షణం పోలీసులతని చేతులకి బేడీలు వేసేసి దొంగ సొమ్ము స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తనని అక్కడినుంచి నడిపించబోతూంటే-

"సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నా చేతులకి బేడీలు వేశారు. మీరు నలుగురూ. నేనొక్కణ్ణే. ఈ గుడికున్న మార్గమూ ఒక్కటే. కనుక నేను తప్పించుకోవడం అసాధ్యం. మీరు ద్వారం దగ్గరుండి నన్నొక్క నిముషం దేముడి ముందు ఒంటరిగా వొదలండి. దేముని ఎదుట ప్రమాణం చేస్తున్నాను. తప్పించుకునే ప్రయత్నమే చేయనని. ఒక్క నిముషం దేముడినీ..నన్నూ.. ఏకాంతంగా వొదలండి." అతను బతిమాలుకున్నాడు.

"ఎందుకూ?" ఒక పోలీసడిగాడు.

"దేవుణ్నొక విషయం అడగాలి."

"దేముడు చెబుతాడా?" నవ్వాడు పోలీసు పిచ్చివాడిని చూసినట్లు చూస్తూ.

"చెబుతాడు."



"సరే." తుపాకీల గురి అతని మీదే ఉంచి వాళ్లు ద్వారం వేపు నడిచారు. దొంగా దేముడూ ఏకాంతంగా మిగిలేలా.

"దేముడా! దయుంచి నా సందేహం తీర్చు. దొంగతనాలు చేసినన్నాళ్లు రక్షించుతూ వొచ్చావే, మానేసి మంచి వాడి నౌతున్న తరుణంలో ఎందుకు పట్టించావు?"

దేముడు నవ్వాడు. "ఇన్నాళ్లూ ఐతే నువ్వింకా దొంగతనాలు చేయబోతూనే ఉంటావుకదా అని ఉదాసీనంగా ఉండగలిగాను. ఇటు పై దొంగతనాలు చేయవు. యిదే నీ చివరి దొంగతనం కనుక తక్షణం తగిన చర్య తీసుకోకపోతే అవకాశం చేజారిపోతుంది కదా? అందుకని. చూడూ..కలియుగంలో మనిషి తన జీవితంలో చేసే మంచి పనులకీ చెడ్డ పనులకీ కూడా ఫలితం అతని జీవితంలోనే ఈ భూమిమీదే అనుభవించెయ్యాలి. నువ్వు చేసిన నేరాలకు శిక్ష అనుభవించాలి." ఆ సమాధానంతో దొంగ సంతృప్తి చెందినట్లే ఉన్నాడు. అతని మనసులోని అనుమానం పటాపంచలయినట్లే ఉంది. అతను దేముడికి మళ్లీ నమస్కరించి పోలీసుల వేపు నడిచాడు.

-ఇచ్ఛాపురపు రామచంద్రం,
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా,
అనకాపల్లి-531001

★